

ఆరోగ్య మహిళ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ



జమ్మికుంటలోఆరోగ్య ఉపకేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో

జమ్మికుంట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య మహిళ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ మహిళలకు సూచించారు. మంగళవారం జమ్మికుంట సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక నుంచి ప్రతి మంగళ, శుక్ర వారం ఆరోగ్య మహిళ శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. ప్రతి మహిళ మూడు నెలలకు ఒకసారైనా వైద్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. జమ్మికుంటలోని ఆరోగ్య ఉపకేంద్రం-1ని డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ చేశారు. హజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు, సివిల్ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, పీవోఎంసీహెచ్ డాక్టర్ సనాజవేరియా, వైద్యాధికారి డాక్టర్ చందన, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, సూపర్వైజర్లు రత్నాకుమారి, అరుణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● మానకొండూర్ పీహెచ్‌సీ తనిఖీ

మానకొండూర్: మానకొండూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి వెంకటరమణ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని గోడపై ప్రదర్శించిన చార్టులో అధిక రక్తపోటు, షుగర్ వ్యాధి మందుల స్లిప్‌ల వివరాలను పరిశీలించారు.

అంగన్‌వాడీల్లో ప్రవేశాలపై దృష్టి

● అమ్మమాట.. అంగన్‌వాడీ బాట పేరిట ప్రత్యేక కార్యక్రమాలు ● 17 వరకు నిర్వహణ



అంగన్‌వాడీ కేంద్రంలో ప్రారంభ సంబరాలు

గణేశ్‌నగర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఈ నెల 10 నుంచి 17 వరకు అమ్మమాట.. అంగన్‌వాడీ బాట పేరుతో ఒక్కో రోజు ఒక్కో కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించింది. ప్రవేశాల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అర్హత ఉన్న పిల్లలందరూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చేలా ప్రణాళికలు రూపొందించింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలను వివరిస్తూ సిబ్బంది కార్యక్రమాన్ని కొనసాగించనున్నారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించే కార్యక్రమాలు

● 10న అంగన్‌వాడీ కేంద్రాలను అలంకరించాలి. తల్లిదండ్రులు, పిల్లలను స్వాగతించాలి. సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేయాలి. సెల్ఫీ తీసుకోవడానికి ప్రోత్సహించాలి. అంగన్‌వాడీ లెవల్ మానిటరింగ్ సపోర్ట్ కమిటీ సభ్యుల ఇతర సంఘాలతో కలిసి గ్రామ స్థాయిలో సమావేశం నిర్వహించాలి.

● 11,12న మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను గుర్తించి వారి ఇళ్లను సందర్శించి వారిని అంగన్‌వాడీల్లో చేర్పించాలి. అంగన్‌వాడీ కేంద్రల్లో ప్రీ స్కూల్ విద్య పూర్తి చేసిన పిల్లలకు ప్రీ స్కూల్ సర్టిఫికేట్ జారీ చేయాలి. వారిని ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించాలి.

● 13 నుంచి 16వరకు బోధన సామగ్రిని అమర్చి అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు స్నేహపూర్వక వాతావరణాన్ని సృష్టించాలి.

● 17న సామూహిక అక్షరాభ్యాసం మిగతా 8వ పేజీలో

సాగు ఖర్చును తగ్గించుకోవాలి

● అవసరం మేరకే రసాయన ఎరువులను వాడాలి
● జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాగ్యలక్ష్మి



కరపత్రాలను విడుదల చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు

కరీంనగర్ రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగు ఖర్చును తగ్గించుకుని అధిక దిగుబడినిచ్చే పద్ధతులు పాటించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాగ్యలక్ష్మి సూచించారు. మండలంలోని దుర్శేడ్ రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ యూరియా వాడకాన్ని తగ్గించాలన్నారు. కరీంనగర్ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్ర వేత్త డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడాలని, రైతులు ఎరువులు కొన్న రశీదులను పంట కోసే సమయం వరకు భద్రంగా ఉంచుకోవాలన్నారు. మరో శాస్త్రవేత్త డాక్టర్ ఏ విజయభాస్కర్ మాట్లాడుతూ సాగునీటిని ఆదా చేయాలని, పంట మార్పిడి పద్ధతిని పాటించాలన్నారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఆర్ శ్రీనివాసరావు, శాస్త్రవేత్త జి వేణుగోపాల్ ఆయిల్‌పామ్‌లో అంతర పంటల సాగు, పంట మార్పిడిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ తోట తిరుపతి, వైస్ చైర్మన్ బీరం అంజనేయులు, వ్యవసాయ విస్తరణ అధికారి పైడితల్లి పాల్గొన్నారు.

'బస్‌పాస్ ఫీజులను తగ్గించాలి'

కరీంనగర్ టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యార్థుల బస్‌పాస్‌ల ఫీజులను వెంటనే తగ్గించాలని పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కుతాటి రాణాప్రతాప్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యార్థులను విద్యకు దూరం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా బస్సు పాస్‌ల ఫీజులను తగ్గించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన లు చేస్తామని హెచ్చరించారు.

చదువుతోపాటు నైపుణ్యం పెంచుకోవాలి

కలెక్టర్ పమేలా సత్పతి



వెదిర కేజీబీవీలో వంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): చదువుతోపాటు నైపుణ్యం పెంచుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్స్ కోర్సు ముగింపు కార్యక్రమం మంకమ్మతోట దన్గర్‌వాడీ పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. శిక్షణ పొందిన 769 మంది సిద్ధం చేసిన పలు రకాల ఆర్ట్ క్రాఫ్ట్, డ్రెస్ మెటీరియల్స్, పెయింటింగ్స్‌తో ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌ను కలెక్టర్ తిలకించి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టైలరింగ్‌లో శిక్షణ పొందినవారు అంగన్‌వాడీ, బాలసదన్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కావాల్సిన డ్రెస్‌లను కుట్టివ్వాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలకు కావాల్సిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ తయారు చేయవచ్చని సూచించారు. కోర్సును విజయవంతంగా పూర్తిచేసి ప్రతిభచాటిన వారికి బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమం లో ఇన్‌చార్జి డీఈవో ఆంజనేయులు, జిల్లా సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డి, కృపారాణి, నరసింహ స్వామి, ఏసీజీ సంధ్యారాణి, డైరెక్టర్ రామస్వామి, కో- ఆర్డినేటర్లు మిల్కూరి శ్రీనివాస్, నాగేశ్వర్‌రావు, దన్గర్ వాడి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల, ప్రమోద, కేఎస్ అనంతాచార్య, గాజుల రవీందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి..

రామడుగు: ప్రభుత్వ వసతిగృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని కలెక్టర్ పమేలా సత్పతి సిబ్బందికి సూచించారు. రామడుగు మండలం వెదిర కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో జిల్లాలోని అన్ని కేజీబీవీలు, బాలికల రెసిడెన్షియల్ హాస్టళ్లలో వంట చేసే 90 మంది సిబ్బందికి మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిబ్బంది వంట చేస్తున్న విధానాన్ని, తయారు చేసిన భోజనాన్ని రుచి చూశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వంట సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ వంట గది పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల న్నారు. నీరు వాడాలని, నాణ్యతతో కూడిన భోజనాన్ని తయారు చేయాల న్నారు. కేజీబీవీల్లో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్ర మంలో తహసీల్దార్ రాజేశ్వరి, జిల్లా బాలికల అభివృద్ధి అధికారి కృపారాణి, కేజీబీవీ ప్రిన్సిపాల్ కవిత పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సమన్యాయం

అందరినీ కలుపుకుని ముందుకు
మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీతోనే సమన్యాయం సాధ్యమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం అనంతరం తొలిసారిగా ధర్మపురి నియోజకవర్గానికి వెళుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు కరీంనగర్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఘన స్వాగతం పలికారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం, ఇతర నాయకులు మంత్రి అడ్లూరిని సన్మానించారు. ఈ సందర్భంగా అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ తనలాంటి బలహీనవర్గాల వ్యక్తికి మంత్రి పదవి ఇచ్చారన్నారు. మంత్రివర్గంలో తనకు చోటు కల్పించిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, కాంగ్రెస్ అధినేత సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తోపాటు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఒక సామాన్య కార్త అయిన తనకు క్యాబినెట్‌లో అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

తనకు వెన్నుదన్నుగా నిలిచిన ఎల్లప్పుడు అండగా సహకరించిన మంత్రులు శ్రీధర్‌బాబుకు, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. 30 ఏళ్ల పోరాటంలో ఎస్సీవర్గీకరణపై సుప్రీం తీర్పును రాష్ట్ర ప్రభుత్వం అమలుచేసిందని, దేశంలో ఎక్కడా లేని విధంగా బీసీ కులగణనను చేపట్టిందన్నారు. బలహీనవర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు విద్యా, ఉద్యోగ, రాజకీయాలల్లో అమలుకు బిల్లు పెట్టింది తెలంగాణ ప్రభుత్వం ఒక్కటేనన్నారు. రాష్ట్రంలో పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని తెలిపారు. మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి ఉమ్మడి జిల్లాలోని 13 నియోజక వర్గాలను అన్నివిధాల అభివృద్ధిపరిచేందుకు కృషి చేస్తానన్నారు. గత ప్రభుత్వం 10 ఏళ్లలో ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన అందరికీ రేషన్‌కార్డులను అందిస్తుందన్నారు. జగిత్యాలలో మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితోపాటు అందరు నాయకులను కలుపుకుని ముందుకు సాగుతానని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం, ఎండీ తాజొద్దీన్, కొరివి అరుణ్‌కుమార్, సమద్‌నవాబ్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, మామిడి సత్యనారాయణరెడ్డి, అట్టెపు వేణు, ధన్నాసింగ్, మీరజ్, మసూంఖాన్, నరేష్, మూల జైపాల్, షబానా మహ్మద్, ముల్కల కవిత, అస్తపురం తిరుమల, ఊరడి లత, జ్యోతిరెడ్డి, హసీనా పాల్గొన్నారు.

పొలం పండుగ

● నేడు ఏరువాక పౌర్ణమి
● వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్నరైతులు

6

ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి

భగత్‌నగర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలుచేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ప్రతీ విద్యా సంవత్సరం ఫీజులను ఇష్టానుసారంగా పెంచుతున్నాయన్నారు. చట్టం అమలు చేయని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేష్, కార్యదర్శి మచ్చ రమేష్, పీడీఎస్‌యూ జార్జ్‌రెడ్డి జిల్లా అధ్యక్షుడు రత్నం రమేష్, సందేష్, తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెంట అజయ్ పటేల్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చెంచల నవీన్, టీఆర్ఎస్వీ నాయకులు బద్దం ప్రవీణ్, కేశబోయిన రాము, మచ్చ పవన్, కళ్యాణ్‌సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ కళాకారులకు న్యాయం చేయాలి

15న ర్యాలీ, కళాభారతిలో 'పాటల పల్లకిలో 12 గంటలు'



సమావేశంలో మాట్లాడుతున్న రఘు, పాల్గొన్న కళాకారులు

కరీంనగర్ కల్చరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమ కళాకారులకు న్యాయం చేయాలని రచయిత, గాయకుడు ఎన్ కిషోర్, టీపీసీసీ సాంస్కృతిక సేన అధ్యక్షుడు సీహెచ్ రఘు అన్నారు. మంగళవారం ఫిలింభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సాంస్కృతిక సారథి సంస్థలో అసలైన కళాకారులకు న్యాయం జరుగలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా సీఎం రేవంత్‌రెడ్డి కళాకారులను ఆదుకోవాలని, ఉద్యోగాలు కల్పించాలని కోరారు. ఉద్యమం పుట్టింది కరీంనగర్‌లోనేనని, అందుకే ఈ నెల 15న ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు కళాభారతిలో 'పాటల పల్లకిలో 12 గంటలు' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అంతకు ముందు 9 గంటలకు కలెక్టరేట్ నుంచి కళాభారతి వరకు కళా ప్రదర్శనలతో ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఉద్యమంలో పని చేసిన కళాకారులు కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. సంబంధిత పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో జి రమేశ్, వినోద, రాజు, జలపతి, రవి, పి రమేశ్, రాజన్న, కళాకారులు పాల్గొన్నారు.

క్రయవిక్రయానికి సిద్ధంగా పద్మనగర్ సమీకృత మార్కెట్

నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

కరీంనగర్ టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వ్యాపారుల క్రయవిక్రయానికి పద్మనగర్ సమీకృత మార్కెట్ సిద్ధంగా ఉందని నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. ఇంజనీరింగ్ అధికారులతో కలిసి మార్కెట్‌ను కమిషనర్ మంగళవారం సందర్శించారు. మార్కెట్‌లో సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పద్మనగర్ సమీకృత మార్కెట్‌లో వ్యాపారులకు అన్ని సౌకర్యాలు కల్పించామని తెలిపారు. మార్కెట్‌లో స్టాల్స్, షటర్లు పొంది నగరపాలక సంస్థతో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు తమ వ్యాపారులను ప్రారంభించాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకోనివారు వెంటనే చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా భరోసాతో ఆర్థికాభివృద్ధి



ఉపాధిహామీ నిధులతో నిర్మించిన మేకల షెడ్డు

కరీంనగర్ రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో భాగంగా సన్న, చిన్నకారు రైతులకు ప్రయోజనకరంగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కరీంనగర్ రూరల్ మండలానికి నవంబరులో మహిళా భరోసా కింద పలు యూనిట్లను మంజూరు చేసింది. పశువుల షెడ్లు 59, కోళ్ల ఫారాలు 4, నాడెం కంపోస్టు 13, మేకల షెడ్లు 5, అజోలా యూనిట్లు 13, ఇంకుడు గుంతలు 10 మంజూరు చేసింది. గ్రామాల్లో ఆయా యూనిట్ల పనులు ప్రగతిలో ఉన్నాయి. ప్రభుత్వం గొర్రెలు, మేకలు, పశువులకు నీడ కల్పించేందుకు షెడ్ల నిర్మాణానికి అవకాశం కల్పించింది. పౌల్ట్రీ షెడ్ల నిర్మాణాలు చేపట్టింది. ఇప్పటి వరకు పశువులుషెడ్లు 59 మంజూరు కాగా 42 ప్రారంభించారు. 27 నిర్మాణాలు పూర్తి చేశారు. పౌల్ట్రీ షెడ్లు నాలుగు యూనిట్లు మంజూరు కాగా చేగుర్తి 2, మొగ్దుంపూర్ ఒకటి పూర్తి చేయగా నగునూర్‌లో ఇంకా ప్రారంభించలేదు. మేకల షెడ్లు ఐదు మంజూరు కాగా మొగ్దుంపూర్, జూబ్లీనగర్, చేగుర్తి గ్రామాల్లో ఒక్కోక్కటి చొప్పున పూర్తయ్యాయి. జూబ్లీనగర్, మొగ్దుంపూర్‌లో ఇంకా ప్రారంభించలేదు. అజోలా 13 యూనిట్లు మంజూరు కాగా, ఎనిమిది పూర్తయ్యాయి.

● మండలానికి 202 యూనిట్లు

2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మహిళా భరోసా కింద 202 కొత్త యూనిట్లను మంజూరు చేశారు. ఇందులో పశువుల షెడ్లు 40, పౌల్ట్రీ షెడ్లు 20, నాడెం కంపోస్టు 10, మేకల షెడ్లు 2, అజోలా 10, ఇంకుడు గుంతలు 100, రూఫ్‌టాప్ వాటర్ హర్వెస్టింగ్ 10, బోర్‌వెల్ రీచార్జి యూనిట్లు 10, ఫార్మేషన్ రోడ్లు 10 కిలో మీటర్ల మేర మంజూరయ్యాయి.



నిర్మాణంలో ఉన్న కోళ్ల ఫాం

సద్వినియోగం చేసుకోవాలి: శోభారాణి, ఏపీవో



మహిళ భరోసా పథకం కింద మంజూరైన యూనిట్లను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలి. గ్రామాల వారీగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేస్తాం గత యేడాది మంజూరైన పనులకు సంబంధించి ఇప్పటి వరకు 20 లక్షల వరకు బిల్లులు చెల్లించాము. ప్రతి రైతుకు ఉపయోగకరంగా ఉండే ఇంకుడు గుంతలు, పశువుల షెడ్లు, పౌల్ట్రీ ఫారాలు మంజూరు చేస్తున్నాం.

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి జీవిత ఖైదు

జగిత్యాల క్రైం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.17 వేల జరిమానా, బాధిత బాలికకు రూ.3 లక్షల పరిహారం చెల్లించాలంటూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతి మంగళవారం తీర్పునిచ్చారు. రాయికల్ పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన బాలికకు మాయమాటలు చెప్పి జైత భీమయ్య(66) అనే వ్యక్తి 2019 సంవత్సరంలో అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై రాయికల్ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి డీఎస్పీ వెంకటరమణ, సీఐ రాజేష్, సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటీ అధికారులు రాజు, కిరణ్ శ్రీధర్‌లు సరైన సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణారావు కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ముద్దాయికి శిక్ష పడడంలో కృషిచేసిన పోలీస్ అధికారులను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థినులకు గాయాలు



ప్రమాదానికి గురైన స్కూటీ

పెద్దపల్లి రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): స్కూటీని లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు గాయపడిన సంఘటన పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జరిగింది. మంగళవారం పెద్దపల్లికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థిని ఓమసియా, భోజన్నపేటకు చెందిన విద్యార్థిని అక్షయలు స్కూటీపై ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలకు వెళ్తుండగా లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ గాయపడగా స్థానికులు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీస్‌స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదులు రాలేదని పోలీసులు తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి రైతు మృతి

మంథనిరూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగారంలో ప్రమాదవశాత్తూ చెరువులో పడి జక్కుల రాజకొమురయ్య (49) మంగళవారం మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. జక్కుల రాజకొమురయ్యకు చెందిన పాడి పశువులు చెరువులో ఉన్నాయి. వాటిని ఒడ్డుకు తీసుకురావటానికి ఆయన చెరువులోకి వెళ్లగా చెరువులోని గుంతలో పడి మృతి చెందాడు. చెరువు ఒడ్డున మృతుడికి సంబంధించిన దుస్తులు, చెప్పులు ఉండటంతో గ్రామానికి చెందిన గట్టయ్య అనే వ్యక్తి చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు చెరువులో గాలించగా మృతదేహం లభించింది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి

శంకరపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కేశవపట్నం గ్రామంలో విద్యుదాఘాతంతో ఓ రైతుకు చెందిన పాడి ఆవు మృతి చెందింది. కేశవపట్నం గ్రామానికి చెందిన ఆరెపల్లి తిరుపతికి చెందిన పాడి ఆవు మంగళవారం ఉదయం మార్కెట్ యార్డు పక్కన ఉన్న వాగు వద్ద మేత కోసం కట్టేశాడు. ఆవు మేత మేస్తూ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఆవు విలువ సుమారు రూ. 40వేల వరకు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు తిరుపతి కోరుతున్నాడు.

పొలం పండుగ

● నేడు ఏరువాక పౌర్ణమి ● వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్న రైతులు



కరీంనగర్ కల్చరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పుడమితల్లి పులకరించే పొలం పండుగ ఏరువాక పౌర్ణమి వచ్చేసింది. రైతుల ముఖాల్లో ఆనందం వెల్లివిరియనుంది. శ్రమజీవన సౌందర్యానికి సూచికైన ఈ పౌర్ణమి విశేషాలు వేదకాలం నుంచి నేటి వరకు ఉన్నాయి. ఏటా వ్యవసాయ పనులకు సిద్ధమయ్యే ముందు అన్నదాతలు పండుగ జరుపుకుంటారు. బుధవారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా పశువులను, వ్యవసాయ పనిముట్లను పూజించి పొలం దున్నేందుకు సిద్ధమవుతున్నారు. ఏరువాక అంటే భూమిని దున్నడం అని అర్థం. జ్యేష్ఠ మాసం శుక్ల పక్ష పూర్ణిమ నాడు ఏరువాకను జరుపుకోవడం ఆనవాయితీ. నైరుతి ఋతుపవనాల రాకతో వర్షాలు కురిసి సమృద్ధిగా పంటలు పండాలని పొలం పనులకు ఆటంకాలు కలుగకూడదని రైతులు ఏరువాకను యజ్ఞంగా భావిస్తారు.

ఆధ్యాత్మిక, చారిత్రక నేపథ్యం

ఏరువాక పౌర్ణమికి ఆధ్యాత్మిక, చారిత్రక నేపథ్యం ఉంది. ఏరువాకను జ్యోతిష శాస్త్రవేత్తలు కష్యారంభం, సస్యారంభంగా వ్యవహరిస్తారు. ఔషధులకు పతి అయిన చంద్రుడు నాగలి పనులకు ఉత్తమ నక్షత్రమైన జ్యేష్ఠా నక్షత్రానికి సమీపంలో సంచరించడమే కారణం. రుతువులలో మార్పును సూచిస్తూ ప్రకృతితో మమేకమైన ఈ పండుగ తొలకరి జల్లులతో ప్రారంభమవుతుంది. నాగలి కదిలేముందు క్షేత్రపాలకుడిని పూజించేవారని రుగ్వేదంలో ఉంది. బుద్ధుడి తండ్రి శుద్ధోదనుడు ఏరువాక రోజున రైతులకు ఒక బంగారు నాగలిని అందించేవాడని బౌద్ధ రచనలు చెబుతున్నాయి. పాళీ, ప్రాకృత భాషల్లోని కథల్లోనూ ఈ ప్రస్తావన ఉన్నట్లు సమాచారం. జైమినీయ న్యామాలా గ్రంథంలో, హాలుని గాథాసప్తశతిలో ఈ పండుగ ప్రస్తావన కనిపిస్తోంది.

● **ఇలా ఆచరిస్తారు**

ఈ పండుగ పూర్తిగా వ్యవసాయానికి, పనిముట్లకు, పశువులకు సంబంధించిన పండుగ కావడంతో రైతులు వ్యవసాయ సాధనాలను, భూమిని, పశువులను పూజిస్తారు. ఎద్దులను కడిగి వాటి కొమ్ములకు రంగులు వేసి ముస్తాబు చేస్తారు. పశువుల పాకలను, పశువులను కట్టే గాటిని, కాడిని, నాగలిని శుభ్రపరిచి పసుపు, కుంకుమలు, గంధంతో అలంకరిస్తారు. ధూప దీప నైవేద్యాలను సమర్పించి పొంగలిని, భక్ష్యాలను వాటికి ఆహారంగా పెడతారు. మంగళ వాయిద్యాలు, పాటలు, పద్యాలు, కోలాహలం మధ్య సాయంత్రం రైతులు నాగలిని భుజంపై ధరించి ఎద్దులను తోలుకుంటూ వ్యవసాయ క్షేత్రాలకు వెళ్తారు. అక్కడ భూమిపూజ అనంతరం వ్యవసాయ పనులు ప్రారంభిస్తారు. గోగు నారను తాడులా చేసి తోరణం కట్టి దాన్ని చెర్నాకోలతో కొడుతూ వారికి దొరికిన నారను తీసుకొని ఎద్దుల మెడల్లో, నాగలికి కడతారు. ఉత్తర భారతంలో పలు ప్రాంతాలతోపాటు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో, కర్ణాటకలోనూ ఈ పండుగను వైభవంగా జరుపుకుంటారు.

ఇసుక తరలిస్తున్న వ్యక్తి రిమాండ్

ఎల్లారెడ్డిపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామంలో పట్టుకుని అదే గ్రామానికి చెందిన వాహన డ్రైవర్ కంకణాల సుధాకర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ రమాకాంత్ మంగళవారం తెలిపారు. గ్రామ శివారులోని మానేరు వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న క్రమంలో వాహనాన్ని ఆపి తనిఖీలు చేయగా అనుమతి లేదని గుర్తించామని పేర్కొన్నారు. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రైవర్ కంకణాల సుధాకర్‌ను రిమాండ్‌కు తరలించామని చెప్పారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

తంగళ్లపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ ఇంట్లో పని చేస్తూ బీపీ ఎక్కువై కింద పడిపోవడంతో తలకు గాయాలు కాగా చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన తంగళ్లపల్లి మండలం చిన్న లింగాపూర్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మహిమల రాజవ్వ (51) ఈ నెల 1న ఇంట్లో పనిచేస్తుండగా బీపీ ఎక్కువై కింద పడిపోయింది. దీంతో రాజవ్వకు తలకు గాయం కాగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా బ్రెయిన్ డెడ్ కావడంతో మంగళవారం మృతి చెందింది. మృతురాలి భర్త రామచంద్రారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొన్న జవాన్‌కు సన్మానం

హుజూరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో మంగళవారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొన్న జవాన్ తిరుపతిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, వర్తినేని రవీందర్‌రావు, శ్రీనివాస్, హరిప్రసాద్, మతిన్ తదితరులు పాల్గొన్నారు.

అన్నపై దాడి కేసులో తమ్ముడికి మూడు సంవత్సరాల జైలు శిక్ష

మెట్‌పల్లిటౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): భూ తగాదాలో అన్నపై దాడి చేసిన తమ్ముడికి మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు పది వేల రూపాయల జరిమానా విధిస్తూ మెట్‌పల్లి కోర్టు న్యాయ మూర్తి అరుణ్‌కుమార్ తీర్పు వెలువరించినట్లు పోలీసులు తెలిపారు. మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆత్మకూరు గ్రామానికి చెందిన మల్లయ్యకు ఐదుగురు కుమారులు కాగా ఆత్మకూరు గ్రామ శివారులో ఆయనకు ఒక ఎకరం భూమి ఉంది. ఆ భూమిని ఐదుగురు కొడుకులు సమానంగా పంచుకునే క్రమంలో చిన్న కొడుకు బీరయ్య వినకుండా గొడవలు సృష్టించేవాడని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో బీరయ్యకు సంబంధించిన 8 గుంటల భూమిని వదిలేసి మిగతా భూమిని నలుగురు అన్నదమ్ములు ఒక్కొక్కరు ఒక్కొక్క సంవత్సరం వ్యవసాయం చేసుకుంటున్నారు. అన్నదమ్ములు సాగు చేసుకుంటున్న పంటను బీరయ్య 2019లో తన ట్రాక్టర్‌తో ధ్వంసం చేయడానికి ప్రయత్నించగా అన్న ముత్త య్య అడ్డుగా వెళ్లాడు. దీంతో అన్నను పారతో కొట్టగా అతని కుడి భుజంపై గాయమైంది. దాడి ఘటనపై రెండో తమ్ముడు నడిపి మల్లయ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై కిరణ్ కుమార్ నిందితుడు బీరయ్యపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రణయ్ కుమార్ సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి అరుణ్ కుమార్ నిందితుడు బీరయ్యకు మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు 10 వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

ట్రైనీ ఎస్సైని సర్వీస్ నుంచి తొలగించాలి



విలేకరులతో మాట్లాడుతున్న సంపత్

హుజూరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండల కేంద్రంలో దళితుడు బత్తుల మహేందర్‌పై దాడి చేసిన ట్రైనీ ఎస్‌ఐ భార్గవ్‌ను సర్వీస్ నుంచి తొలగించాలని టీపీసీసీ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ రాష్ట్ర ఇన్‌చార్జి టి సంపత్ అన్నారు. మంగళవారం హుజూరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత నెల రోజుల క్రితం మహేందర్‌పై పోలీసులు దాడి చేసిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపో వడంతో ట్రైనీ ఎస్సై భార్గవ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారన్నారు. పోలీ సులు ప్రజలను రక్షించడానికి ఉన్నారే తప్ప దౌర్జన్యంగా కొట్టడానికి కాదన్నారు. ట్రైనీ ఎస్‌ఐ భార్గవ్‌ను సర్వీస్ నుంచి తొలగించకపోతే హైకోర్టుకు వెళ్తామన్నారు. సమావేశంలో ఆర్ రామచంద్రం, టి వసంత్, సీహెచ్ రాహుల్, మహేందర్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

వెల్ఫేర్ బోర్డుతోనే సంక్షేమ పథకాలను వర్తింపజేయాలి

● భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు చిలువేరు స్వామి



సమావేశంలో మాట్లాడుతున్న చిలువేరు స్వామి

రామగిరి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): లేబర్‌కార్డు పొందిన భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ, ప్రమాద బీమా పథకాలను వెల్ఫేర్ బోర్డుతోనే వర్తింపచేయాలని భవన నిర్మాణ కార్మిక సమైఖ్య సంఘం అధ్యక్షుడు చిలువేరు స్వామి అన్నారు. మంగళవారం కల్వచర్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ భవన, నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా ఈ నెల 4న ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలు దరఖాస్తు చేసుకోవడానికి ఆహ్వానించిందన్నారు. ప్రమాద బీమా రూ.8లక్షలు కాగా శాశ్వత వైకల్యానికి రూ. 5లక్షలు, పాక్షిక వైకల్యం రూ. 4లక్షలు, సాధారణ మరణం రూ. 2లక్షలు ఇవ్వాలని షెడ్యూల్‌లో పేర్కొన్నారని తెలిపారు. తద్వార సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అందె అవకాశం ఉండవని తెలిపారు. ఇన్సూరెన్స్ కంపెనీలు పెట్టే నిబంధనలతో కార్మికులు నష్టపోవాల్సిన పరిస్థితి ఉంటుందని పేర్కొన్నారు. గతంలో మాదిరిగానే సంక్షేమ ఫలాలను కార్మికులకు అందించాల్సిందిగా డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వారికి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరునహరి రాజు, ఎస్కే షరీఫ్, భైరిశంకర్, మల్లేష్, శంకర్, రాజయ్య, చంద్రమౌళి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్‌తో రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం



పీఎఫ్ కమిషనర్ ఫసియొద్దిన్‌ను సన్మానిస్తున్న రెవా నాయకులు

జ్యోతినగర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : రామగుండం ఎన్టీపీసీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం(రెవా) ఆధ్వర్యంలో మంగళవారం ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ మహమ్మద్ ఫసియొద్దిన్‌తో కరీంనగర్‌లోని పీఎఫ్ కార్యాలయంలో సమావేశమయ్యారు. నిజ వేతన ఆధారిత పెన్షన్(హయ్యర్ పెన్షన్)కు సంబంధించి 230 మంది మాజీ ఉద్యోగులు వారి బకాయి డబ్బుల డీడీలను గతేడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో పీఎఫ్ కార్యాయంలో సమర్పించారని సంఘం నాయకులు గుర్తు చేశారు. 55 మంది విశ్రాంత ఉద్యోగులకు రివైజ్డ్ పీపీవోలు ఈనెలలో జారీ చేస్తామని, జూలైలో మరో 100 మంది రిటైర్డ్ ఉద్యోగులకు జారీచేస్తామని కమిషనర్ తెలిపారు. ఇప్పటి వరకు 10 మంది మాజీ ఉద్యోగులకు రివైజ్డ్ పీపీవోలు జారీ చేసినందుకు పీఎఫ్ కమిషనర్ ఫసియొద్దిన్, ఎపిఎఫ్‌సి వెంకటేశ్వర్లు, అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. రీజినల్ పీఎఫ్ కమిషనర్ ఫసియొద్దిన్‌ను రెవా నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో సంఘం(రెవా) అధ్యక్షుడు ఆకుల రాంకిషన్, ఉపాధ్యక్షుడు మంగళంపల్లి రాంనారాయణ, సంయుక్త కార్యదర్శి చెప్యాల శ్రీపతిరావు, జానకిరాం, తదితరులు పాల్గొన్నారు.

టేకు చెట్లు నరికి దుంగల అపహరణ



తాండ్ర్యాలలో నరికివేసిన టేకు చెట్టు

కథలాపూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : కథలాపూర్ మండలంలోని తాండ్ర్యాలలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రైతుల పొలాల్లో ఉన్న టేకు చెట్లను నరికివేసి ఎత్తుకెళ్లారు. తీగల వెంకట్రావు, తీగల సత్యారావు, కాల్వ రాజేశం, కనకట్ల ప్రసాద్ అనే రైతులు తమ పొలాల వద్ద టేకు చెట్లను పెంచుకున్నారు. దుండగులు రాత్రి వేళలో 11 చెట్లను నరికివేసి దుంగ లను ఎత్తుకెళ్లినట్టు బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనలో దాదాపు 4 లక్షల మేర నష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

సెల్‌ఫోన్ అప్పగింత



ఫోన్ అందజేస్తున్న సీఐ నిరంజన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం గోపాల్‌పూర్‌కు చెందిన మేడిద హరీష్ మే 18న సెల్‌ఫోన్ పోగొట్టుకొని రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా మంచిర్యాలలో ఉన్నట్లు గుర్తించి రికవరీ చేశారు. మంగళవారం బాధితుడు హరీష్‌కు రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ఫోన్ అప్పగించారు.

విద్యుదాఘాతంతో 40 గొర్రెల మృతి



కటికెనపల్లి శివారులో మృతిచెందిన గొర్రెలు

ధర్మారం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ధర్మారం మండలం చామనపల్లి గ్రామానికి చెందిన 40 గొర్రెలు విద్యుత్‌షాక్‌తో మృతి చెందాయి. చామనపల్లి గ్రామానికి చెందిన ఏడుగురు కాపరులు కటికెనపల్లి గ్రామ శివారులో గొర్రెలను మేపేందుకు మంగళవారం మధ్యాహ్నం తీసుకెళ్లారు. నల్లవాగు ప్రాంతంలోని సున్నం మాటు వద్ద గొర్రెలు నీరు తాగుతూ వాగు దాటే క్రమంలో విద్యుత్ స్తంభం ఇన్సులేటర్ విరిగి ఇనుప స్తంభం పట్టీపై పడింది. స్తంభం నుంచి చెట్ల కొమ్మల ద్వారా వాగు నీటికి విద్యుత్ సరఫరా అయ్యింది. దీంతో నీరు తాగుతున్న గొర్రెలు షాక్‌కు గురయ్యాయి. ఈ సంఘటనలో 40 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా 30 గొర్రెలు అస్వస్థతకు గురయ్యాయి. సంఘటన స్థలాన్ని ట్రాన్స్‌కో ఏడీ విజయ్‌కుమార్, ఏఈ ఎండీ ఖాసీమ్ సందర్శించారు. చనిపోయిన 40 గొర్రెలకు సంస్థ తరుపున 2 లక్షల 80వేలు రూపాయలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అస్వస్థతలో ఉన్న జీవాలు ఎప్పుడు చనిపోతాయో తెలియని పరిస్థితిలో ఉన్నాయని, వాటితో కలిపి 6 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని గొర్రెల కాపరులు డిమాండ్ చేశారు.

నష్ట పరిహారం పూర్తిగా చెల్లించాలి

ప్రమాదవశాత్తు మృతి చెందిన గొర్రెలకు పూర్తి స్థాయిలో నష్ట పరిహారం చెల్లించి తమను ఆదుకోవాలని గొర్రెల కాపరులు డిమాండ్ చేస్తున్నారు. విద్యుదాఘాతంతో చామనపల్లి గ్రామానికి చెందిన దాడి ఐలయ్య, దాడి ఓదెలు, నిట్టు మల్లయ్య, భైర రాయలింగు, నిట్టు ముజ్జయ్య, కొమ్ము లచ్చయ్యలకు చెందిన 40 గొర్రెలు మృతి చెందగా 30 గొర్రెల వరకు అస్వస్థతకు గురై ప్రాణాపాయ స్థితితో ఉన్నాయి. సంఘటన స్థలాన్ని పరిశీలించిన ట్రాన్స్‌కో అధికారులు మృతి చెందిన 40 గొర్రెలకు ఒక్కోదానికి 7 వేల చొప్పు న మొత్తం 2 లక్షల 80 వేల నష్ట పరిహారం చెల్లిస్తామని చెప్పగా గొర్రెల కాపరులు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు. తామంతా 6 లక్షల వరకు నష్టపోయామని అస్వస్థతకు గురై ప్రాణాపాయ స్థితిలో ఉన్న గొర్రెలకు కూడా నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. సంఘటన స్థలాన్ని బీజేపీ సీనియర్ నాయకులు కన్న అంజయ్య, జిల్లా గొర్రెల కాపరుల సఘం అధ్యక్షులు వేల్పుల నాగరాజు, గొర్రెల సొసైటీ మండల అధ్యక్షులు జంగ మహేందర్ సందర్శించారు.

భార్య వేధింపులు తాళలేక భర్త ఆత్మహత్య



హరీష్ (ఫైల్)

బోయినపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : భార్య వేధింపులు తాళలేక భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన బోయినపల్లి మండలం తడగొం డ గ్రామంలో మంగళవారం జరిగింది. ఎస్‌ఐ రాజకుమార్ తెలిపిన వివరాల ప్రకారం తడగొండ గ్రామానికి చెందిన కుంటాల హరీష్(36)కు కావేరితో 2014లో వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. హరీష్ గత కొద్ది సంవత్సరాలుగా గల్ఫ్‌బాట పట్టాడు. కొద్ది నెలల క్రితం హరీష్ స్వగ్రామానికి రాగా భార్య కావేరి హరీష్‌ను సూటి పోటి మాటలతో వేధించడమే కాకుండా ఆత్మహత్య చేసుకోవాలంటూ ఇబ్బంది పెడుతుండేది. దీంతో భార్య వేధింపులు తట్టుకోలేక హరీష్ గ్రామంలోని వ్యవసాయబావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అయి తే తన కుమారుడి మృతికి కోడలు కావేరి కారణమని తల్లి ప్రమీల ఎస్‌ఐకి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో లారీ దగ్ధం



దగ్ధమవుతున్న లారీ

సుల్తానాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సుగ్లాంపల్లి గోదాముల వద్ద షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిన అగ్ని ప్రమాదంలో లారీకి నిప్పంటుకుంది. అయితే సమీపంలో ఉన్న మిగతా లారీ డ్రైవర్లు, హమాలీలు లారీకి అంటుకున్న మంటలను ఆర్పేందుకు సహాయక చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న పెద్దపల్లి అగ్నిమాపక కేంద్రం నుంచి ఫైరింజన్ వచ్చి మంటలను పూర్తిగా ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో పెద్దపల్లికి చెందిన లారీ కొంత కాలిపోయింది. వివిధ మిల్లుల నుంచి బియ్యం లోడ్‌లతో వచ్చిన లారీలు అన్‌లోడ్ అయ్యాక పక్కన నిలిపి ఉంచారు. అయితే పైన ఉన్న విద్యుత్ తీగలు గాలిదుమారం వలన ఒకటికొకటి తాకుతూ నిప్పురవ్వలు చెలరేగి లారీకి అంటుకున్నాయని ప్రత్యక్షంగా చూసిన వారు తెలిపారు. లారీ డ్రైవర్లు, హమాలీలు, అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలతో పెద్ద ప్రమాదం తప్పిపోయింది.

ఇసుక లారీ డ్రైవర్ల ధర్నా



కొర్కల్‌లో రోడ్డుపై ధర్నా చేస్తున్న ఇసుక లారీ డ్రైవర్లు

వీణవంక, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్కల్ గ్రామంలోని మానేరు వాగు ఇసుక రీచ్ యాజమాన్యం రోజులు గడుస్తున్నా లోడింగ్ చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని లారీ డ్రైవర్లు రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. మూడు రోజులు గడుస్తున్నా లారీల్లో ఇసుక లోడింగ్ చేయడం లేదని అన్నారు. ప్రతి రోజు చేయాల్సిన లోడింగ్ చేయకుండా తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని వారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి లారీ డ్రైవర్లను సముదాయించి ఆందోళన విరమింపజేశారు. కొర్కల్ ఇసుక రీచ్ నుంచి అక్రమ ఇసుక రవాణా కొనసాగుతోందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై ఎన్‌సీసీ కేడెట్లకు శిక్షణ



శిక్షకులకు సర్టిఫికెట్ ప్రదానం అధికారులు

రామడుగు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని, వాటిని నియంత్రించే పద్ధతులను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందని కల్నల్ ఆఫీసర్ ఏకే జయంతి, స్టేషన్ ఫైర్ ఆఫీజర్ రాజు నాయక్ అన్నారు. మండలంలోని వెదిర అల్ఫోర్స్ పాఠశాలలో ఎన్‌సీసీ కేడెట్ల శిక్షణ శిబిరంలో అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వారు మాట్లాడుతూ అకస్మాత్తుగా జరిగే ప్రమాదాలను నివారించవలసిన అవసరం ఎంతగానో ఉందన్నారు. అగ్నిప్రమాదాలు జరిగినపుడు ఆస్తినష్టం, ప్రాణనష్టం కాకుండా వెంటనే స్పందించాలని అన్నారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఆఫీసర్ వి కృష్ణ, సబ్ మేనేజర్ సాగర్‌సింగ్, కేడెట్లు పాల్గొన్నారు.

రైతులకు శిక్షణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

చొప్పదండి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్లాపూర్, వెదురుగట్ట గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌లో భాగంగా రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పంటల సాగులో ఎదురవుతున్న సమస్యలను, నూతన సాంకేతిక పరిజ్ఞానంపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సువర్ణ, డాక్టర్ మహేష, ప్రియదర్శిని, మండల వ్యవసాయ అధికారి వంశీ, విస్తరణ అధికారులు సాయి ప్రసన్న, సంపత్ పాల్గొన్నారు.


ఆలయాల్లో ప్రత్యేక పూజలు

చొప్పదండి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండ సురేఖల పేరుతో పలు ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర డీడీఎన్ సంఘం ఉపాధ్యక్షుడు ప్రభాకరాచార్యులు అన్నారు. అర్చక ఉద్యోగులతో పాటు ధూపదీప నైవేద్య అర్చకుల కోసం పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడంతో రాష్ట్ర ప్రభుత్వం కోసం 41 రోజులపాటు డీడీఎన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదెల మృతి

మల్యాల, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యంపేటకు చెందిన మర్రి తిరుపతి గేదెలు రెండు విద్యుదాఘాతంతో మృతి చెందాయి. మేత కోసం కొండగట్టు సమీపంలోకి వెళ్లగా తెగిపడి ఉన్న విద్యుత్ తీగలు తాకి గేదెలు మృతి చెందాయని తిరుపతి తెలిపాడు. మృతి చెందిన గేదెల విలువ రూ.1.50లక్షల వరకు ఉంటుందని అన్నాడు.

ఇందిరమ్మ ఇళ్లకు గుత్తేదారుల వల



- 400 చదరపు అడుగుల భవనానికి రూ.10 లక్షలు
- 600 చదరపు అడుగులకు రూ.16 లక్షలు
- లబ్ధిదారులతో ఒప్పందాలు ● అప్పు చేస్తున్న పేదలు

ఎల్లారెడ్డిపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నీడలేని నిరుపేదలకు గూడు కల్పించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. పల్లెల్లో ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించి అర్హులను ఎంపిక చేసింది. లబ్ధిదారుల జాబితాను ప్రకటించింది. ఈ నెల 8తో శుభ ముహూర్తాలు ముగియడంతో ఎల్లారెడ్డిపేట మండలంలోని లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. అదే అదనుగా భావించిన కొందరు గుత్తేదారులు తాము ఇళ్ల నిర్మాణాలను చేపట్టేందుకు లబ్ధిదారులకు వల విసిరారు. 400 చదరపు అడుగుల భవనానికి రూ.10 లక్షలు చెల్లిస్తే అన్ని పనులు పూర్తి చేయడంతో పాటు రంగులు వేసి గృహ ప్రవేశానికి సిద్ధం చేసి ఇస్తామంటూ ముందుకు వస్తున్నారు. 600 చదరపు అడుగుల భవనానికి రూ.16 లక్షలు చెల్లిస్తే నిర్మిస్తామని పేర్కొంటున్నారు.

ప్రభుత్వ నిబంధనలతో తమకు సంబంధం లేకుండా అంతా తామే చూసుకుంటామని స్పష్టం చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల బిల్లు మీరే చూసుకోవాలని తేల్చి చెబుతున్నారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ప్రభుత్వం అందిస్తున్న రూ.5 లక్షలతో పాటు రుణం తీసుకుంటే తమకు ఎలాంటి ఇబ్బందులు ఉండకుండా గుత్తేదారులే చూసుకుంటారని భావిస్తున్న లబ్ధిదారులు ఒప్పంద పత్రాలను రాసుకుంటున్నారు. ముందుగా డబ్బులు చెల్లిస్తున్నారు. ఉన్నంతలో సొంతింటి కల సాకారం చేసుకుందామనుకుంటున్న పేదలకు గుత్తేదారులు అన్ని వసతులతో నిర్మించి ఇస్తామని పేర్కొంటుండడంతో అప్పులు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు.



ఇందిరమ్మ పథకం.. గుత్తేదారులకు వరం

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు గుండారం, రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, రాచర్లతిమ్మాపూర్, వెంకటాపూర్, నారాయణపూర్, బండలింగంపల్లి, దుమాల, తదితర గ్రామాల్లో ఇళ్లు లేని నిరుపేదల కోసం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం గుత్తేదారులకు వరంలా మారనుంది.

మండలంలో మొత్తం 643 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఆయా గ్రామాల్లో లబ్ధిదారులు సుమారు 200 ఇళ్లకు భూమి పూజ చేశారు. పల్లెల్లో ఇళ్ల నిర్మాణాల సందడి నెలకొనడంతో గుత్తేదారులు వాలారు. తాము 400, 600 చదరపు అడుగుల ఇంటి భవన నిర్మాణంతో పాటు రంగులు, ఇతర పనులు పూర్తి చేసి తాళం చెవులను అందజేస్తామని పేర్కొంటున్నారు. అందుకు తమకు రూ.10 లక్షలు, రూ.16 లక్షలు చెల్లించాలని నిర్ణయించారు. ఇళ్ల నిర్మాణ పనుల్లో ఇబ్బందులు లేకుండా ఉంటాయనే ఆలోచనతో గుత్తేదారులతో లబ్ధిదారులు ఒప్పందం కుదుర్చుకుంటున్నారు.

బిల్లుల చెల్లింపు ఇలా...

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు భూమి పూజ చేసిన నుంచి పనులు పూర్తయ్యే వరకు గృహ నిర్మాణ శాఖ అధికారుల పర్యవేక్షణలో కొనసాగుతాయి.

- లబ్ధిదారుడు తన స్వంత స్థలంలో 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేపట్టాలి.
- ప్రభుత్వం చెల్లించే రూ.5 లక్షల్లో పునాది నిర్మాణం పూర్తయిన తర్వాత రూ.లక్ష లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తారు.
- రెండో విడతలో గోడలు నిర్మించిన తర్వాత రూ.1.25 లక్షలు జమ అవుతాయి.
- స్లాబ్ దశలో ప్రభుత్వం రూ.1.75 లక్షలను జమ చేస్తుంది.
- ఇంటి నిర్మాణం పూర్తయిన అనంతరం లబ్ధిదారులకు రూ.లక్ష ఖాతాలో జమ చేయడంతో మొత్తం ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఒక్కో లబ్ధిదారుడికి సర్కారు అందించే రూ.5లక్షల ఆర్థిక సాయం అందుతుంది.

నిబంధనల మేరకే బిల్లులు : సత్తయ్య, ఎంపీడీవో, ఎల్లారెడ్డిపేట



మండలంలోని గ్రామాల్లో నిరుపేదను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఎంపిక చేయడంతో పాటు మంజూరు పత్రాలను అందజేశాం. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులను చేపట్టారు. గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలను గుత్తేదారులకు అప్పగిస్తూ ఒప్పంద పత్రాలు రాసిస్తున్నారనే విషయం తమ దృష్టికి రాలేదు. ప్రభుత్వ నిబంధనల మేరకు గృహ నిర్మాణ శాఖ అధికారులు పర్యవేక్షించిన తర్వాత వివిధ దశలో బిల్లుల చెల్లింపుల ప్రక్రియ కొనసాగుతుంది.

తెలంగాణ క్రీడా పాఠశాలల్లో ప్రవేశానికి

దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రాంతీయ క్రీడా పాఠశాలల్లో 4వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. రాష్ట్రంలోని హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లలో నిర్వహిస్తున్న పాఠశాలల్లో 2025-26 విద్యాసంవత్సరానికి నాలుగో తరగతిలో అర్హులైన విద్యార్థులకు ఎంపిక ప్రక్రియను నిర్వహించనున్నామని జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఈ ఎంపికలను మూడంచెల పద్ధతిలో ఈ నెల 16 నుంచి 19 వరకు మండల స్థాయిలో, ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 25, 26 తేదీల్లో జిల్లాస్థాయిలో ఎంపికైన విద్యార్థులకు జూలై 1 నుంచి 5 వరకు రాష్ట్రస్థాయిలో పోటీలను నిర్వహించనున్నట్లు వివరించారు. మూడు క్రీడా పాఠశాలల్లో 60 మంది బాలురు, 60 మంది బాలికలకు ప్రవేశాలు కల్పిస్తారని తెలిపారు. 3వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు 01-09-2016 నుంచి 31-08-2017 మధ్య జన్మించి 8 నుంచి 9 సంవత్సరాల వయస్సు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌లో వివరాలను నమోదు చేసుకోవచ్చని సూచించారు. అలాగే ప్రవేశాలకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం ప్రత్యేక క్యూఆర్ కోడ్‌ను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు అందుబాటులో ఉంచిన క్యూఆర్ కోడ్

ఎస్‌యూ ఆంగ్ల విభాగంలో డిజిటల్ తరగతులు



డిజిటల్ క్లాస్‌లను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ ఆచార్య సూరేపల్లి సుజాత

గణేశ్‌నగర్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ కళాశాలలో ఆంగ్ల విభాగంలో డిజిటల్ క్లాసు రూమ్‌ల ను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిజిటల్ క్లాస్‌రూమ్‌లు విద్యా సంస్థలకు, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అనేక ప్రయోజనాలను, బోధనను, అభ్యాసాలను నేర్చుకోవడానికి సహకారం అందిస్తాయన్నారు. ఆంగ్ల విభాగాధిపతి విజయ ప్రకాష్ మాట్లాడుతూ డిజిటల్ క్లాస్ రూమ్‌ని అందించిన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్‌కు, రిజిస్ట్రార్ ఆచార జాస్తి రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

లలితపల్లిలో ఎల్లమ్మ బోనాలు

ఎలిగేడు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఎలిగేడు అనుబంధ గ్రామమైన లలితపల్లిలో లక్ష్మీపార్వతిదేవి, రేణుక ఎల్లమ్మ బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం శివపట్నం వేసి బద్దిపోచమ్మ, ఎల్లమ్మ దేవతలకు మహిళలు బోనం ఎత్తుకొని మంగళహారతులతో డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా తరలివచ్చి బోనాలను దేవతలకు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. యాదవ సంఘం అధ్యక్షుడు మండల చిన్న గట్టయ్య, నాయకులు మండల శ్రీశైలం, శంకర్, బావు పోశాలు, రవి, మామిడి రాజయ్య, కనకయ్య, రాములు పాల్గొన్నారు.



ఎల్లమ్మ బోనాలతో మహిళలు

● సుల్తానాబాద్ : మండలంలోని చిన్నకలువలలో మంగళవారం ఎల్లమ్మ బోనాల పండుగను నిర్వహించారు. గ్రామస్థులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

బద్ది పోచమ్మ ఆలయానికి

పోటెత్తిన భక్తులు

వేములవాడ కల్చరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పిల్లాపాపలను, పాడిపంటలను చల్లగా చూడు బద్ది పోచమ్మ తల్లీ.. అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని సోమవారం దర్శించుకున్న భక్తులు మంగళవారం అమ్మవారి దర్శనానికి పోటెత్తారు. ఉదయాన్నే అమ్మవారికి మట్టిపాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని డప్పుచప్పుళ్లతో శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా ఆలయానికి తరలివచ్చారు. భారీగా తరలివచ్చిన భక్తులతో క్యూలైన్‌లు కిక్కిరిసిపోయాయి. అమ్మవారి దర్శనానికి భక్తులు నెత్తిన బోనాలతో సుమారుగా నాలుగు గంటలపాటు నిరీక్షించినట్లు తెలిపారు. ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు ముందుగా అమ్మవారికి పట్నం వేసి నూతన వస్త్రాలు అందజేసి ఒడి బియ్యం సమర్పించారు. అమ్మవారికి నైవేద్యాన్ని అందజేసి కల్లుసాకతో మొక్కులు చెల్లించుకున్నారు. పిల్లాపాపలను, పాడిపంటలను చల్లంగా చూస్తే మళ్లీ వచ్చేయేడుకు తిరిగివచ్చి మొక్కులు చెల్లిస్తామని చెప్పి భక్తులు తిరుగు ప్రయాణమయ్యారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో ఆధ్వర్యంలో ఉద్యోగులు క్యూలైన్‌లు త్వరగా కదిలేలా చర్యలు తీసుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ వీధుల్లో రద్దీ కనిపించింది.



శివసత్తుల నృత్యాలతో ఆలయానికి వెళుతున్న భక్తులు



బోనాలతో క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

డాక్టర్ భూంరెడ్డి మృతి తీరనిలోటు

● ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



భూంరెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

కరీంనగర్ అర్బన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): డాక్టర్ భూంరెడ్డి మరణం తీరని లోటని, వైద్య వృత్తితోపాటు సామాజిక సేవకు కృషి చేశారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం కరీంనగర్‌లో నివాళులుర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూంరెడ్డి ఎంఎస్ చదువుతున్న రోజుల్లో ఢిల్లీలోని ఏయిమ్స్‌లో అప్పటి ప్రధానమంత్రి జవహర్ లాల్‌నెహ్రూ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్, పట్టా అందుకున్నట్లు చెప్పారు. ఆ రోజుల్లో అనారోగ్య కారణాలతో జవహర్ లాల్‌నెహ్రూ ఆసుపత్రిలో చేరిన సమయంలో భూంరెడ్డిని స్వయంగా పిలిపించుకొని వైద్య సేవలు పొందడం గర్వించదగ్గ విషయమని గుర్తుచేసుకున్నారు. అంతకుముందు భూంరెడ్డి కుమారుడు సూర్య నారాయణరెడ్డిని, కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. మంత్రితోపాటు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, చల్మెడ లక్ష్మీనర్సింహారావు పాల్గొన్నారు.

భూంరెడ్డికి మంత్రి పొన్నం ప్రభాకర్ నివాళులు



భూంరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో ప్రముఖ వైద్యులు డాక్టర్ భూంరెడ్డి సోమవారం ఆకస్మికంగా మృతి చెందగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం రాత్రి ఆయన ఇంటికి వెళ్లి భూంరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డాక్టర్ భూంరెడ్డి కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. కాంగ్రెస్ నాయకులు వైద్యుల అంజన్‌కుమార్, గడ్డం విలాస్‌రెడ్డి, ఎస్‌ఏ మోసిన్, రాచకొండ చక్రాధర్, పొన్నంసత్యం ఉన్నారు.

నివాళులుఅర్పించిన చాడ

● భగత్‌నగర్ : ప్రముఖ వైద్యుడు భూంరెడ్డి పార్థివ దేహం వద్ద సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి మంగళవారం కరీంనగర్‌లో నివాళులు అర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సంతాప సభ

రాజబహద్దూర్ వెంకటరామరెడ్డి విజ్ఞాన పరిషత్ (రెడ్డి సంక్షేమ సంఘం) ఆధ్వర్యంలో మంగళవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వి.భూమ్‌రెడ్డి సంతాప సభను నిర్వహించారు. అధ్యక్షుడు నరహరి జగ్గారెడ్డి, కార్యదర్శి బండ గోపాల్‌రెడ్డి, కాసర్ల మధూకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల బస్‌చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం తగ్గించాలి

- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు శనిగరపు రజనీకాంత్

సిరిసిల్ల రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యార్థుల బస్‌పాస్ చార్జీలను వెంటనే తగ్గించడంతో పాటు జిల్లాలో ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటుచేసిన పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు శనిగరపు రజనీకాంత్ డిమాండ్ చేశారు. విద్యార్థుల బస్‌పాస్ చార్జీలను రాష్ట్రం ప్రభుత్వం పెంచడంతో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెంచిన బస్‌పాస్ చార్జీలను తగ్గించాలంటూ నిరసనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు రజనీకాంత్ మాట్లాడుతూ ఇప్పటికే గతంలో పెంచిన బస్‌చార్జీలు, విద్యార్థుల బస్‌పాస్ చార్జీల కారణంగా గ్రామాల్లోని విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. మళ్లీ బస్‌పాస్‌లపై 20 శాతం చార్జీలు పెంచి అమలుచేస్తే బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు ప్రధానంగా ఉన్నత చదువు కోసం బస్సులను నమ్ముకున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొని చదువుకు దూరమైయ్యే ప్రమాదం ఉందన్నారు. ఆర్టీసీ యాజమాన్యం ఇప్పటికే చాలా రూట్లల్లో విద్యార్థుల కోసం బస్సులను నడపడం లేదన్నారు. బస్సుల సంఖ్య పెంచి ఉచిత బస్‌సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. తక్షణమే పాసుల చార్జీల పెంచాలనే ఆలోచనలను విరమించుకోవాలని లేకుంటే ఆందోళన చేపడుతామన్నారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా అనుమతులు లేని పాఠశాలలు ఉన్నాయని, వాటిని విద్యాశాఖ అధికారులు వెంటనే సీజ్‌చేయాలని అన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకులాలు, కేజీబీవీలు, సంక్షేమ హాస్టల్‌లకు పక్కా భవనాలను నిర్మించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్‌లను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కల్యాణ్‌కుమార్, జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, జిల్లా బాలికల కన్వీనర్ సంజన, జిల్లా కమిటీ సభ్యులు సాయిభరత్, శివ, నాయకులు జస్వంత్, అఖిల్, అక్షయ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఘనంగా రేణుకా ఎల్లమ్మ బోనాలు



ఉత్సవానికి హాజరైన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

రామడుగు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిప్పకుర్తి, రామచంద్రపురం గ్రామంలో జరుగుతున్న గౌడ కులస్థుల ఆరాధ్య దైవమైన రేణుకా ఎల్లమ్మ బోనాల ఉత్సవాల్లో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్నాలలో మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హైమాక్స్ లైట్స్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

- టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటుకం రమేష్



సిరిసిల్లలో టీఆర్‌టీఎఫ్ బడిబాట బైక్‌ర్యాలీ

సిరిసిల్ల రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, పిల్లలందరినీ తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కటుకం రమేష్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా సిరిసిల్లలో మంగళవారం తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుర్ర కృష్ణప్రసాద్‌గౌడ్, బోయన్న గారి నారాయణల ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీని పట్టణంలోని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ పాఠశాలల్లో కంప్యూటర్ విద్య, ఏఐ ఆధారిత విద్య, డిజిటల్ విద్య ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అందిస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మెంబర్‌షిప్ కన్వీనర్ సుంకిశీల ప్రభాకర్‌రావు, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు మోతీలాల్, టీఆర్‌టీఎఫ్ నాయకులు పోతుగంటి రమేష్, మహేశుని లక్ష్మీనారాయణ, గోలీ రాధాకిషన్, ముత్తయ్యగారి నాగరాజు పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన కొండగట్టు



కొండగట్టు ఆలయం వద్ద భక్తులు



అస్తవ్యస్తంగా వాహనాల పార్కింగ్

మల్యాల, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి క్షేత్రం మంగళవారం భక్తులతో రద్దీగా మారింది. మంగళవారం వేకువ జాము నుంచే వేలాదిగా తరలివచ్చిన వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. గంటల తరబడి క్యూలైన్‌లలో వేచి ఉండి అంజన్నకు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు. జగిత్యాల జిల్లా జడ్జి రత్నపద్మావతి మంగళవారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో ఆలయానికి వచ్చిన న్యాయాధికారికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలుకగా ఆలయంలో స్వామి వారికి పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై చిలుక శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అస్తవ్యస్తంగా వాహనాల పార్కింగ్

● భక్తులకు ఇబ్బందులు

కొండగట్టు కొండపై వాహనదారులు అస్తవ్యస్తంగా పార్కింగ్ చేస్తుండడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి మంగళ, శనివారాల్లో ఆంజనేయస్వామి దర్శనానికి ఇరవై వేలకు పైగా భక్తులు వందలాది వాహనాల్లో తరలివస్తుంటారు. అయితే సరైన పార్కింగ్ ప్రదేశాలు లేకపోవడంతో కొండపైన, వైజంక్షన్, జేఎన్‌టీయూ మార్గం, ఘాట్‌రోడ్డు మొత్తం వాహనాలతో నిండుతున్నాయి. స్వామి వారి దర్శనానికి ఒక్క రోజు ముందే వాహనాలు పార్కింగ్ చేసి పెట్టడంతో ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇకనైనా అధికారులు ఘాట్‌రోడ్డు, జేఎన్‌టీయూ మార్గంలో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసి కొండపైన వాహనాలను నియంత్రించి అసౌకర్యం కలుగకుండా చూడాలని పలువురు భక్తులు కోరుతున్నారు. రద్దీ సమయాల్లో వాహనాలను ఇష్టారీతిలో నిలపడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

● న్యూస్‌బాక్స్

నేడు 146వ ఎన్నీల ముచ్చట్లు

కరీంనగర్ కల్చరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం 5 గంటలకు బ్యాంక్ కాలనీలోని సిరి అపార్ట్‌మెంట్‌లో 146వ ఎన్నీల ముచ్చట్ల సాహిత్య కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెరవే ప్రధానకార్యదర్శి దామరకుంట శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈఎన్ గార్డెన్ ఎదురుగా ఉన్న వీధిలో కవి పెనుగొండ బసవేశ్వర్ ఆతిథ్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇదే వేదికపై పెనుగొండ సరసిజ రాసిన 'పద... అలా నడిచొద్దాం' పుస్తకాన్ని డాక్టర్ నలిమెల భాస్కర్ ఆవిష్కరిస్తారని, పుస్తకాన్ని సీవి కుమార్ పరిచయం చేస్తారని తెలిపారు. కవులు, రచయితలు మినీ కవితలు, చిన్న కథలతో హాజరు కావాలని కోరారు.

ఏకగ్రీవ ఎన్నిక

కరీంనగర్ రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం నగునూర్ గ్రామ పెరుక సంఘం (పురగిరి క్షత్రియ) కుల సంఘం అధ్యక్షుడిగా ఇట్టినేని రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం నగునూర్ పెరిక సంఘం భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యక్షుడిగా ఇట్టినేని రమేష్, గౌరవ అధ్యక్షుడిగా కందుల నరేందర్, ఉపాధ్యక్షులుగా కోట మునిరాజ్, ప్రధాన కార్యదర్శిగా కోట మల్లయ్య, కార్యదర్శి కోట కనకయ్యను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా తన ఎన్నికకు సహకరించిన కుల సంఘం, కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

హామీలపై ప్రశ్నించండి

తిమ్మాపూర్, జూన్ 10 (ఆంధ్ర జ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలపై గ్రామాల్లో ఎప్పుడూ ప్రశ్నిస్తూనే ఉండాలని బీజేపీ సంకల్ప సాకార యోజన జిల్లా ఇన్‌చార్జి గుజ్జ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కొత్తపల్లిలో మంగళవారం నిర్వహించిన బీజేపీ మండల కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. ప్రధాని మోదీ నేతృత్వంలో భారత ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటూ సుపరిపాలన అందిస్తోందన్నారు. 11 ఏళ్ల కాలంలో మోదీ ప్రభుత్వం చేసిన గణమైన కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. స్థానిక సంస్థల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



కొత్తపల్లి పట్టణంలో బడిబాట

భగత్‌నగర్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని మండల విద్యాధికారి ఆనందం అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో భాగంగా మంగళవారం కొత్తపల్లి పట్టణంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అనుబంధ పాఠశాలల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రధానోపాధ్యాయిని పద్మశ్రీ పాల్గొన్నారు.

చిగురుమామిడి : మండలంలోని బొమ్మనపల్లి, రేకొండ, చిన్నముల్కనూర్ గ్రామాల్లో విద్యావాహిని విద్యా చైతన్య రథంతో ఎంఈవో పావని ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్, కొలిమికుంట, మల్లన్నపల్లి, కోనేరుపల్లిలో బడిబాట నిర్వహించారు. ఎంఈవో మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్: కరీంనగర్ మండలంలో బుధవారం ఉదయం 7గంటలకు నగునూర్ గ్రామంలో విద్యా వాహిపి ప్రచార రథంతో బడిబాట నిర్వహించనున్నట్లు ఎంఈవో రవీందర్ తెలిపారు.

ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలి

హుజూరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం బీజేపీ నాయకులతో కలిసి హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కార్ ప్రజల ఆరోగ్య భద్రతపై నిర్లక్ష్యం చూపుతోందన్నారు. నిరుపేద ప్రజలకు ప్రభుత్వాస్పతుల్లో సరైన వైద్య సదుపాయాలు అందే పరిస్థితి లేదన్నారు. అరకొరగా వైద్యసేవలు అందుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా ఆరోగ్య భద్రత కోసం పెద్దపీట వేసిందన్నారు. బీజేపీ పట్టణాధ్యక్షుడు తూర్పాటి రాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగేశ్వర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్,జూన్10(ఆంధ్రజ్యోతి): మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా బుధవారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ టూ, రూరల్ ఏడీఈలు లావణ్య, రఘు ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 10:30 వరకు బైపాస్ ఏరియా ఎన్‌టీఆర్ విగ్రాహం నుంచి సబ్‌స్టేషన్ వరకు, ఉజ్వల పార్క్, పాలిటెక్నిక్ కళాశాల, ఐటీఐ కళాశాల, హోటల్ శ్రద్ధ, మాతృభూమి అపార్ట్‌మెంట్, ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొత్తపల్లి (ఎచ్)రాణిపూర్‌లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

గణేశ్‌నగర్, జూన్10(ఆంధ్రజ్యోతి):బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ జన్మదినం సందర్భంగా ఆ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వృద్ధుల ఆశ్రమంలో కేక్ కట్ చేసి వృద్ధులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కనుకయ్య గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు నారోజు రాకేష్ చారి ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్ జన్మదిన వేడకలు నిర్వహించారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని ఎల్ఎండీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో యువజన కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ ఫైనల్‌లో మానకొండూరు జట్టుపై అలుగునూర్ జట్టు విజయం సాధించింది. ఈ సందర్భంగా మంగళ వారం ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. యువజన కాంగ్రెస్ ఆధ్వ ర్యంలో మత్తు పదార్థాల నిర్మూలనలో భాగంగా అవగాహన కల్పించేందుకు టోర్నీ నిర్వహించడం అభినందనీయమన్నారు. అంతకు ముందు విజేత లకు బహుమతులు అందజేశారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం, నాయకులు మామిడి అనిల్, క్రికెట్ నిర్వహకులు తాళ్లపల్లి శ్రీకాంత్, తొర్తి అరవింద్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని రక్షించిన వీరుడు ఛత్రపతి శివాజీ

భగత్‌నగర్, జూన్10(ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మాన్ని, సంస్కృతిని సమాజాన్ని సంరక్షించిన వీరుడు ఛత్రపతి శివాజీ అని ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత గ్రామ వికాస ప్రముఖ్ జిన్నా సత్యనారాయణ అన్నారు. మంగళవారం నగరంలోని వైశ్య భవన్‌లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కరీంనగర్‌నగర శాఖ ఆధ్వర్యంలో హిందూ సామ్రాజ్య దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఛత్రపతి శివాజి మహారాజ్ పట్టభిషేక దినోత్స వాన్ని హిందూ సామ్రాజ్య దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. పారాఒలంపిక్ పతకవిజేత జాతీయ అవార్డు గ్రహీత వన్నెల అంజనారెడ్డి, డాక్టర్ చక్రవర్తుల రమణాచారి పాల్గొన్నారు.

పర్వతారోహకుడికి కలెక్టర్ అభినందన

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పర్వతారోహకుడు భూక్య యశ్వంత్‌ను కలెక్టర్ పమేలా సత్పతి అభినందించారు. మంగళవారం యశ్వంత్ కలెక్టర్‌ను కలిసి తాను అధిరోహించిన మిజోరం, మణిపూర్, త్రిపుర, అరుణాచల్‌ప్రదేశ్, రాజస్థాన్‌లోని ఎత్తైన శిఖరాల ఫొటోలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యశ్వంత్ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడని, భవిష్యత్‌లో ఎత్తైన శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

అంగన్‌వాడీల్లో ప్రవేశాలపై దృష్టి

(5వపేజీ తరువాయి)

నిర్వహించాలి. ప్రీస్కూల్ పుస్తకాలు, అసెస్‌మెంట్ కార్డులు ప్రదర్శించాలి. తల్లిదండ్రులను, గ్రామ పెద్దలను ఆహ్వానిం ప్రారంభ బాల్య సంరక్షణ విద్య (ఈసిసిఈ)పై అవగాహన కల్పించాలి.

అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

- ఎం సరస్వతి, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి

అంగన్వాడీ కేంద్రాలోని సౌకర్యాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలి. విద్యార్థుల నమోదు కోసం 10 నుంచి17 వరకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రకటించింది. టీచర్లు, సిబ్బంది బడిబాట కార్యక్రమంలో పాల్గొంటూ తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం.

అంగన్‌వాడీ బాటను విజయవంతం చేయాలి

కరీంనగర్ టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఐసీడీఎస్, స్వయంసహాయ సంఘాల సభ్యులను జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి ఒక ప్రకటనలో కోరా రు. ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు ప్రతీ ఇంటిని సందర్శించి పిల్ల లను అంగన్‌వాడీలో చేర్పేవిధంగా తల్లిదండ్రులతో మాట్లాడాలని సూచించారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కరీంనగర్ కల్చరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మంమకమ్మతోట వేంకటేశ్వరాలయంలో 15వ త్రయాహ్నిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపక వంశపారంపర్య ధర్మకర్త పిట్టల శ్రీనివాస్-వినోద, ఈవో నాగారపు శ్రీనివాస్, అర్చకులు పాల్గొన్నారు.

కేంద్రం నుంచి ఏం తెచ్చారని సంబరాలు



విలేకరులతో మాట్లాడుతున్న చల్ల హరిశంకర్

సుభాష్‌నగర్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కేంద్రం నుంచి ఏం తెచ్చారని బీజేపీ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నారని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ప్రశ్నించారు. మంగళవారం నగరంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రెండో సారి ఎంపీగా గెలిచిన బండి సంజయ్ కేంద్ర మంత్రి అయ్యారని, చిల్లి గవ్వకూడా తీసుకురాలేదని విమర్శించారు. నిజంగా బండి సంజయ్‌కుమార్‌కు చిత్తశుద్ధి ఉంటే ఉమ్మడి జిల్లాలో జిల్లాకు ఒక నవోదయ పాఠశాల, ఒక సైనిక్ స్కూలు మంజూరు చేయించాలన్నారు. వేములవాడ, కొండగట్టు, ఇల్లందకుంట రామాలయాలను ప్రసాద్ పథకంలో చేర్చి నిధులు మంజూరు చేయించాలన్నారు. కొత్తపల్లి మున్సిపల్ మాజీ ఎంపీపీ భూక్య తిరుపతినాయక్, బీఆర్ఎస్ నగర ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్‌రెడ్డి, నియోజకవర్గ యూత్ ప్రధానకార్యదర్శి గంగాధర చందు, బొంకూరి మోహన్, నగర మైనార్టీ అధ్యక్షుడు షౌకత్, భేతి చంద్రశేఖర్, ఆరె రవి, జెల్లోజి శ్రీనివాస్, ఎడబోయిన శ్రీనివాస్‌రెడ్డి, నారాదాసు వసంతరావు, సత్తినేని శ్రీనివాస్, కిరణ్‌కుమార్, పవన్‌రావు పాల్గొన్నారు.

గోపాల్‌పూర్-దుర్శేడ్ డివిజన్ ఏర్పాటుపై అభ్యంతరం

కరీంనగర్ రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ డివిజన్‌ల విభజనపై గోపాల్‌పూర్ గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గోపాల్‌పూర్- దుర్శేడ్ గ్రామాలను కలిపి ఏర్పాటు చేసిన 3వ డివిజన్, బౌగోళిక విభజన, పరిపాలన సమస్యలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ మంగళవారం గ్రామ మాజీ సర్పంచ్ ఊరడి మల్లారెడ్డితోపాటు పలువురు అధికారులకు ఫిర్యాదు చేశారు. గోపాల్‌పూర్, దుర్శేడ్ గ్రామాలను కలిపిన పుడు రాజీవ్ రహదారి మధ్యలో ఉండడంతో మున్సిపల్ డీలిమిటేషన్ నియమావళికి విరుద్ధంగా ఉందన్నారు. గోపాల్‌పూర్‌ను స్వతంత్ర డివిజన్‌గా ఏర్పాటు చేయాలన్నారు. గోపాల్‌పూర్ శివారులో గుండి వాగు పక్కన పాత గాంధీ పేపర్ మిల్లు ప్రాంతం, చల్మెడ ఆనందరావు మెడికల్ కళాశాల, లక్ష్మీనగర్ ప్రాంతాలు గ్రామంతో సహజంగా కలిసిపోయాయని, ప్రత్యేక డివిజన్‌గా ఏర్పాటు చేస్తే పరిపాలన సౌలభ్యం పెరుగుతుందని అన్నారు. గోపాల్‌పూర్, దుర్శేడ్ విలీన గ్రామాలను వేర్వేరు డివిజన్లుగా ఏర్పాటు చేయాలని విన్నవించారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటు



ప్రారంభిస్తున్న సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ కల్చరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మంకమ్మతోట వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి చొరవతో 10 మినీ హై మాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. అంతకుముందు ఆలయంలో శ్రీవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక వంశపారంపర్య ధర్మకర్త శ్రీనివాస్, ఈవో ఎన్.శ్రీనివాస్, అర్చకులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ వేసవి శిక్షణ శిబిరం

భగత్‌నగర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సీతారాంపూర్‌లోని ఐవీషై ఇంటర్నేషనల్ (సీబీఎస్ఈ) పాఠశాలలో నిర్వహించిన వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం మంగళవారంతో ముగిసింది. ముగింపు కార్యక్ర మంలో పాఠశాల వ్యవస్థాపకుడు పసుల మహేష్, కో-చైర్మన్ దాసరి శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునే విధంగా శిక్షణ శిబిరాన్ని నిర్వహించామన్నారు. 80 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నట్లు చెప్పారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందించారు. కోచ్ నరేన్, వీపీటీఏ సెక్రటరీ గౌతమ్‌రెడ్డి, అనూప్ పాల్గొన్నారు.



జ్ఞాపిక అందజేస్తున్న పాఠశాల యాజమాన్యం

కిట్స్ విద్యార్థుల వీడ్కోలు హంగామా



నృత్యం చేస్తున్న విద్యార్థులు

హుజూరాబాద్‌రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగాపూర్ కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఫైనలియర్ చదువుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లర్నింగ్ ఏఐఎంఎల్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాల విద్యార్థుల వీడ్కోలు మంగళవారం నిర్వహించారు.కళాశాల డైరెక్టర్ డాక్టర్ శంకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరయ్య. ఇంటలిజెన్స్ మిషన్ లెర్నింగ్ విభాగాధిపతి డాక్టర్ ప్రవీన్‌కుమార్, నిర్వాహకుడు అధ్యాపకుడు రాజశేఖర్, మెకానికల్ ఇంజనీరింగ్ అధ్యాపకుడు వెంకటేష్ పాల్గొన్నారు.

శ్రీచైతన్యలో..



ప్రశంస పత్రాలు అందజేస్తున్న చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి

తిమ్మాపూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ, ఈఈఈ విభాగం విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. శ్రీచైతన్య విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి మాట్లాడారు. ప్రాంగణ నియామకాలలో ఎంపిక అయ్యేలా విద్యార్థులు సాధన చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, విభాగ అధిపతులు రవికుమార్, ఓదెలు యాదవ్ పీడీ సునీత, ఏవో రామారావు, మీడియా ఇన్‌చార్జి జి.రమేష్ పాల్గొన్నారు.

వాగేశ్వరిలో ప్రాంగణ నియామకాలు



ప్రాంగణ నియామకాలలో ఎంపికైన వాగేశ్వరి విద్యార్థులు

తిమ్మాపూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో మెడికో ఇంక్‌వారి ఆధ్వర్యంలో ప్రాంగణ నియామకాలు చేపట్టినట్లు వాగేశ్వరి విద్యాసంస్థల ప్రధాన కార్యదర్శి గంద్ర శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సుమారు 120 మంది విద్యార్థులకు 54 మంది ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థులను విద్యాసంస్థల ప్రధాన కార్యదర్శి గంద్ర శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు. కళాశాల సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు ప్రకాశ్‌రెడ్డి, వినోద్, ప్రిన్సిపాల్స్ శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ, ప్లేస్ మెంట్ ఆఫీసర్ శ్రవన్‌కుమార్, శ్రీధర్ పాల్గొన్నారు.

ఘనంగా కవ్వంపల్లి జన్మదిన వేడుకలు



తెలంగాణ చౌక్‌లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి



కవ్వంపల్లికి కేక్ తినిపిస్తున్న సతీమణి అనురాధ

కరీంనగర్ అర్బన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ జన్మదినం సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం జిల్లా వ్యాప్తంగా సంబరాలు నిర్వహించారు. ఇందిరా చౌక్ వద్ద నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను కవ్వంపల్లి సత్యనారాయణ కట్ చేశారు. కార్యక్రమాల్లో సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, టీపీసీసీ ఎస్సీ సెల్ కన్వీనర్ వెన్న రాజ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు. ఇందిరా గార్డెన్‌లో జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను పార్టీ శ్రేణుల సమక్షంలో కట్‌చేశారు.

● తిమ్మాపూర్: హైదారాబాద్ నుంచి కరీంనగర్‌కు వస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు నుస్తులాపూర్ గ్రామం వద్ద కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి ఘనస్వాగతం పలికారు. అక్కడే కేక్ కట్ చేశారు. అలుగునూర్ కూడలి వద్ద కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివచ్చి క్రేన్ సహాయంతో భారీ గజమాల వేసి కేక్ కట్ చేయించారు. అలుగునూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు తుది వరకు శ్రమిస్తానన్నారు. మంత్రి పదవి రాలేదని ఎవరూ నిరాశపడవద్దని, ప్రజల ప్రోత్సాహంతో ఆ ప్రయత్నాన్ని కొనసాగిస్తానని అన్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సతీమణి కవ్వంపల్లి అనురాధ మాట్లాడుతూ కవ్వంపల్లి కుటుంబానికి బాధలు కొత్తేమీ కాదని, ఎన్నో ఆటు పోట్లు, అవరోధాలను అధిగమిస్తూ ఈ స్థితికి వచ్చామని భావోద్వేగానికి లోనయ్యారు.

● హుజూరాబాద్: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాల యంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు.

● ఇల్లందకుంట: సీతారామచంద్రస్వామి ఆలయ ఆవరణలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పెద్ది కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.

● వీణవంక: మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో ఎమ్మెల్యే కవ్వంపల్లి జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు.

● గన్నేరువరం: ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ జన్మదిన వేడుకలు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు.

● మానకొండూర్: ఎమ్మెల్యే కవ్వంపల్లి జన్మదినం మండల కేంద్రంలోని పల్లెమీద బస్టాండ్ వద్ద కాంగ్రెస్ నాయకులు కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సంపత్‌గౌడ్, నందగిరి రవీంద్రాచారి పాల్గొన్నారు.

● శంకరపట్నం: శంకరపట్నం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య, మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్‌లు కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు.

● జమ్మికుంట రూరల్ : జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సుంకరి రమేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో భూభారతి రెవెన్యూ సదస్సులు

జమ్మికుంట రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జమ్మి కుంట మండలం వావిలాలలో మంగళవారం భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ భూ సమస్యలపై 221 మంది దర ఖాస్తులు అందజేశారు. దరఖాస్తులను హుజూరాబాద్ ఆర్డీవో పరిశీలించారు. త్వరలోనే భూ సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ నల్ల వెంకట్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, గిర్ధావర్లు సత్యా నారాయణ, శంకర్ పాల్గొన్నారు.

ఇల్లందకుంట : భూ భారతి కార్యక్రమాన్ని తహసీల్దార్ రాణి ఆధ్వర్యంలో మండలంలోని చిన్నకోమటి పల్లిలో నిర్వహించారు. భూ సమస్యల పై 24 దరఖాస్తులను రైతులు అధికారులకు అందజేశారు. కార్యక్ర మంలో డిప్యూటీ తహసీల్దార్ మన్‌మిత్ సింగ్, ఆర్ఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం : మండలంలోని మొలం గూర్‌లో తహసీల్దార్ సురేఖ ఆధ్వ ర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహిం చారు. 121మంది రైతులు భూ సమ స్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

గంగాధర : గంగాధర మండలం మల్లాపూర్‌లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా తహసీ ల్దార్ అనుపమ మాట్లాడుతూ భూ భారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచిం చారు. భూసమస్యలపై 112 దరఖా స్తులు వచ్చినట్లు తెలిపారు.



ప్రారంభిస్తున్న ఆర్డీవో రమేష్‌బాబు, డీఎంహెచ్‌వో వెంకటరమణ

'ఆరోగ్య మహిళ'ను సద్వినియోగం చేసుకోవాలి

హుజూరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని హుజూరాబాద్ ఆర్డీవో రమేష్‌బాబు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. మంగళవారం హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేస్తోందన్నారు. ప్రత్యేకంగా మహిళల కోసం ఆరోగ్య మహిళా కార్యక్రమం అమలు చేస్తోందన్నారు. ప్రతీ మంగళవారం ఆస్పత్రుల్లో 8 రకాల వైద్య సేవలందిస్తారన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ నారాయణరెడ్డి, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సమావేశం

హుజూరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రపంచమంతా ప్రధాని మోదీ వైపు చూస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళశారం హుజూరాబాద్ పట్టణంలోని శిశు మందిర్‌లో బీజేపీ నాయకులతో సమావేశం నిర్వహించారు.

●ఇల్లందకుంట: ప్రధాని మోదీ పాలన ఓ స్వర్ణయుగమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కన్నేబోయిన ఓదెలు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.

● వీణవంక : మండల కేంద్రంలో మండల బీజేపీ కార్యవర్గ సమావేశం మంగళవారం నిర్వహిచారు. ముఖ్య అతిథిగా జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రాల వెంకట్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వ 11 సంవత్సరాల పాలన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు.

● శంకరపట్నం: స్థానిక సమరానికి బీజేపీ శ్రేణులు సిద్ధం కావాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నర్సింహరాజు అన్నారు. శంకరపట్నం మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఏనుగు అనిల్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు.

● జమ్మికుంట: ప్రధానమంత్రి నరేంద్రమోదీ కృషి వల్ల ప్రపంచంలో 4వ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారతదేశం అవతరించిందని బీజేపి జిల్లా ప్రధానకార్యదర్శి వెంకట్‌రెడ్డి అన్నారు. జమ్మికుంటలో పార్టీ సమావేశంలో మాట్లాడారు.

ఎమ్మెల్యే ఐలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలి

జమ్మికుంట రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రివర్గ విస్తరణలో ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి కేటాయించకపోవడం బాధాకరమని కురుమ గొల్ల గొర్రెల పెంపకందారుల సహకార సంఘం సెక్రెటరీ కొమ్ము నరేష్ అన్నారు.

ముగిసిన వాలీబాల్ శిక్షణ శిబిరం

వీణవంక, జూన్10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామంలో గత నెల రోజులుగా నిర్వహిస్తున్న వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరం మంగళవారం ముగిసినట్లు కోచ్ కర్నె నాని తెలిపారు. నెల రోజులుగా విద్యార్థులకు ఉచితంగా వాలీబాల్ రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిలో రాణించేలా మెలుకవలు నేర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాని,గంధం రాజు,పెద్దులు,హరీష్,పవన్,శంకర్,అరవింద్, సాత్విక్,మణిదీప్ తదితరులున్నారు.